
# శనిదేవత పదధ్వనులు



**సుబ్బరామయ్య ఎప్పుడు ఎవరిమీద, ఏ అంశం మీద కథ రాస్తారో ఎవరి ఊహకూ అందని విషయం. మరెవరి దృష్టికీ ఆనని బాధాసర్పదష్టులను అక్కున చేర్చుకొని, తన రచనలద్వారా సేదదీర్చడంలోనే ఉంది ఆయన ప్రత్యేకత. అందరికీ తెలిసిన సంగతినైనా, ఆయన చూసే చూపే వేరు!**

ఈ కళ్లజోడిక ఎంతమాత్రం లాభంలేదు. దీన్ని నమ్ముకుంటే ఉన్న కాస్త దృష్టీ పోయేట్లుంది అనుకున్నాను కళ్లజోడు తీసి పంచె చివరతో తుడుచుకుంటూ. తర్వాత కళ్ల జోడు ముఖానికి తగిలించుకుని చెవిపక్కకు చెయ్యి పోనిచ్చి స్విచ్ నొక్కాను. శబ్దం మొదలయింది.


పైన గుబురుగా దయ్యపు గొడుగులా పెరిగిన నిద్రగన్నేరు చెట్టు....పైనుండి ఉండి ఉండి రాలి పడుతున్న చినుకులు...

వర్షం ఆగిపోయింది. కాని చల్లని గాలి విసురుగా వీస్తూనే ఉంది. పక్కగా నాటురకం టీస్టాలు, దానిముందు రెండో మూడో బల్లలు. ముగ్గురో నలుగురో కూర్చుని టీ సేవిస్తున్నారు. పెద్దగా అరుస్తున్నట్లు మాట్లాడుకుంటున్నారు. లారీ ఒకటి 'బొంయ్'మని రొదచేసుకుంటూ దూసుకుపోయింది.

ఉదయం పదిగంటలు దాటి ఉంటుంది. ఇంటి దగ్గర తొమ్మిదింటికే బయలుదేరాను. రెండు బస్సులు మారి వచ్చి, నాకు కావలసిన ఇంటికోసం వాకబుచేస్తూ తిరుగుతుండగా మొదలయింది వర్షం. ఎక్కడెక్కడి మబ్బులో కూడబలుక్కున్నట్లు గుమిగూడి వచ్చి పక్కా అరగంట సేపు కుండపోతగా వర్షించాయి. ఇదుగో, ఇప్పుడు నీళ్ళ బరువు తీర్చుకుని తేలికపడి ఆకాశంలో దూది పింజల్లాగా తేలిపోతున్నాయి. నేను హియరింగ్ ఎయిడ్ స్విచాఫ్ చేసి చేతివ్రేళ్లు విరుచుకుంటూ నిల బడిపోయాను. ఉన్నట్లుండి మళ్ళీ ఘనీభవించిన నిశ్శబ్దం.

నిన్న అంటే శనివారం ఉదయం ఆ కొద్ది పెన్షన్ రాళ్లూ తెచ్చుకుందామని బ్యాంకుకు వెళ్ళాను. వాకబు చేస్తే ఆ డబ్బు ఇంకా రాలేదన్నారు. ఆ కౌంటర్‌లో ఉండే వ్యక్తి నాకు పరిచితుడే. పేరు రవీంద్ర. చాలా సానుభూతితో 'ఇంకా రాలేదండీ మీ డబ్బు. సోమ వారం రండి' అన్నాడు. బహుశా నా పరిస్థితి అతనికి అర్థమై ఉంటుంది. వచ్చే పెన్షన్ చాలా కొద్ది...నెలలో పదిరోజులకు కూడా సరిపోదు. మిగిలిన ఖర్చుఅంతా భరించేది మా అమ్మాయి లలిత. ఇంటికైన పెద్ద కూతురు. దాని తరువాతివాడు రాముడు... శ్రీరామ చంద్రమూర్తి... రెండేళ్లయింది ఇల్లు వదలిపోయి. ఎక్కడ ఉన్నాడో, ఏం చేస్తున్నాడో, అసలు ఉన్నాడో లేడోకూడా తెలియదు. మూడోవాడు చిరంజీవి. వాడు డిగ్రీ పూర్తిచేసి ఏ పనీ దొరక్క రికామీగా తిరుగు తున్నాడు. తర్వాతది జానకి. దీనికి మాత్రం పెళ్లి చెయ్యగలిగాను. అది ఎక్కడో దూరంగా ఒరిస్సాలో భర్తతో ఉంటున్నది. లలితకు పెళ్లికాలేదు. అది చేసుకో లేదు. చేసుకోనన్నది. ఇప్పుడిక దానికి పెళ్లికాదు. దానికా చింతకూడా లేదు. పావం, తనను తాను కరిగించుకుంటూ ఆ గొర్రెతోక రాబడి గుమాస్తా ఉద్యోగం చేస్తూ, వచ్చేదంతా ఇంటికోసం ఖర్చుచేస్తూ జంతువు లాగ జీవిస్తున్నది.

చిత్రాలు: పి.ఎస్. బాబు



**"మిమ్మల్నేనండి! ఎంత పిలిచినా వినిపించుకోకుండా వెళ్ళిపోతారేం? మా నాన్నగారు పిలుస్తున్నారు."**

అదిసరే, ఇలా ఎంతసేపు నిలబడడం? ఈ ఇల్లు కనుక్కోడం ఇవేళ సాధ్యంఅయ్యేట్లులేదు. ఇక ఇంటిదారి పట్టడం మేలు. మళ్ళీ మబ్బులు పైన గుమిగూడుతున్నాయి. సముద్రం మీదినుంచి ఇలా ఉండి ఉండి మబ్బులు బయలుదేరివచ్చి కుండ లతో పలె నీళ్లను కుమ్మరించిపోవడం ఈ కాలంలో మామూలే. నేను గొడుగు తెచ్చుకోకపోవడం తెలివి తక్కువ. అయినా ఆ గొడుగు ఉండిమాత్రం ఉద్ధ రించేదేముంది? అది ఎప్పటిదో, ఇక్ష్వాకుల కాలంనాటిది.

నెమ్మదిగా కదిలి నడవడం ప్రారంభించాను. రోడ్డంతా ఈమాత్రపు వర్షానికే బురద బురదగా తయారై బీభత్సంగా ఉంది. అటూ ఇటూ చూస్తూ నడుస్తున్నాను. రవీంద్ర ఇంట్లో ఉన్న పాతకాలపు గ్రామఫోను రికార్డులు నన్ను నడిపిస్తున్నాయి. అతడు చెప్పిన ఇంటిగుర్తులు సరిగా గుర్తులేవు. ఒక కాగితంమీద రాసుకుని ఉంచుకుంటే బాగుండి పోయేది. చూస్తూనే నడుస్తున్నాను. ఒక ఇంటి ముందు ఒక మధ్యవయస్కుడు నిలబడి తీరిగ్గా సిగరెట్టు కాల్చుకుంటున్నాడు. బహుశా ఉద్యోగి అయి ఉంటాడు.

నేను చెవిక్రిందికి చెయ్యి పోనిచ్చి స్విచ్ నొక్కి గబగబ అతనివైపు నడిచాను.

అతడు నన్ను చూసి కనుబొమలు ఎగురవేసి 'ఏమిటన్నట్లు' చూశాడు. నేను చెప్పాను. 'ఆయన పేరు రవీంద్ర..రవీంద్రనాథ్ అనుకుంటాను. బ్యాంకులో ఉద్యోగం.'

'ఈ వీథిలో బ్యాంక్ వాళ్ళెవరూలేరు. పక్క వీథిలో వాకబుచేయండి.'

నేను నిరాశగా వెనుదిరిగాను. మళ్ళీ నడక సాగించాను. లాభంలేదు. ఇవాళ అంతా తిరిగినా ఆ యిల్లు కనుక్కోడం నా తరంకాదు. ఇక ఈ వ్యర్థ ప్రయత్నం మానుకుని బస్సుస్టాపుకు చేరుకుని సిటీ బస్సు ఎక్కి ఇంటి ముఖం పట్టడం క్షేమం అనుకున్నాను.

హియరింగ్ ఎయిడ్ స్విచాఫ్ చేసి నడుస్తున్నాను. దీన్ని అవసరం లేనప్పుడు ఆఫ్ చెయ్యకపోతే బ్యాటరీ వృథాగా ఖర్చయిపోతుంది. అసలే ఖరీ దెక్కువ. ఈమధ్య ఆ సున్నితమైన బ్యాటరీలు దొర కడం లేదు. దీన్ని పొదుపుగా వాడుకోకపోతే అనర్థం. లలిత, పావం, ఆరేడు నెలల క్రిందట బ్యాటరీ అయిపోయి బాధ పడుతూఉంటే కొన్ని ఖర్చులలో ఇదీ ఒకటని వెదికి వెదికి మరీ కొనుక్కుని వచ్చింది. ఇక దీని ఆయుస్సుకూడా ఎంతోకాలం లేదు. అందు వల్ల అతి జాగ్రత్తగా పొదుపుగా వాడుకోడం క్షేమం.

పొద్దున్న ఎప్పుడో తాగిన కాఫీ. పొట్టలో మరేమీ పడలేదు. ఇంట్లో చెబితే బయటికి రానివ్వరు. అందుకని 'ఇదుగో, వీథి చివరివరకే' అని చెప్పి బయలుదేరి వచ్చేశాను. నెమ్మదిగా అడుగులు వేస్తూ నడుస్తున్నాను.

అంతలో ఎవరో వెనుకనుంచి నా పంచె పట్టుకుని లాగినట్లనిపించి వెనుదిరిగి చూశాను. పది పన్నెండేళ్ల కుర్రాడు ఏదో అంటున్నాడు. హఠాత్తుగా స్విచ్చాన్ చేశాను.

'మిమ్మల్నేనండి! ఎంత పిలిచినా వినిపించుకో కుండా వెళ్లిపోతారేం? మా నాన్నగారు పిలుస్తున్నారు. అంతంత కేకలుపెట్టినా వినలేదు మీరు' అంటున్నాడు ఆ కుర్రవాడు రొప్పుతూ.

"రండి" అంటూ అతడు దారి తీశాడు.

దాదాపు ఇరవై గజాలు నడిచాము. రవీంద్ర వీథి గుమ్మంలోనే నిలబడి ఉన్నాడు. వడివడిగా వెళ్లిన నన్ను చూసి నవ్వుతూ "ఏమిటి బాబుగారూ! పెద్ద పెద్ద కేకలుపెట్టాను నేను. వినిపించలేదా?" అన్నాడు.

నేను చూపుడువ్రేలితో చెవి చూపించాను.

"ఓహో! అదా సంగతి? రండి రండి" అంటూ లోపలికి దారితీశాడు.

రవీంద్ర నన్ను పక్క గదిలోకి తీసుకుపోయాడు.

ఇల్లు చిన్నదే అయినా ముచ్చటగా ఉంది. ఆ గది చిన్నదే అయినా చక్కగా సర్ది ఉంది. ఒకవైపు బల్ల. ఖరీదైనదేమీకాదు. కాని పూలకుండీవల్ల అందంగా ఉంది. పక్కనే చక్కగా పేర్చిన పుస్తకాలు..గదికి ఒకవైపు పొడవాటి కిటికీ. బయట ఆవరణలోనుంచి చల్లనిగాలి వీస్తున్నది. కిటికీ అవతల మందారచెట్టు. ఆపైన ప్రహరీగోడ పక్కనే ముచ్చటగా పెరిగిన మామిడిచెట్టు. దాని గుబురులలో దాగివుండి కూస్తున్న దొక కోయిల. గోడ అవతలివైపునుంచి పొరుగింటి పిల్లలెవరో 'కూకూ' అని అరుస్తూ ఆ అమాయకపు వృద్ధ కోయిలను రెచ్చగొడుతున్నారు. నేను యంత్రాన్ని స్విచాఫ్ చేయకుండా అంతా వింటూ అలా హాయిగా కుర్చీలో కూర్చుండిపోయాను.

నేనింతవరకు చూడలేదు. నావెనక కొంచెం ఎత్తుగా గోడమీద ఒక పాత ఫోటో వ్రేలాడుతున్నది. తెలిసిన ముఖంలాగా కనిపిస్తే లేచి కళ్లజోడు సర్దు కుని బాగా దగ్గరగా వెళ్లి చూశాను. ఈ ముఖం ఎప్పటిదో! అగాధమైన మనసు పొరలలో ఎక్కడో గుప్తమై నిక్షిప్తమై ఉన్నది. వెంటనే స్ఫురణకు రావడంలేదు. ఇరవై లేక ఇరవై అయిదేళ్ల ప్రాయం. గుండ్రని అందమైన ముఖం. పలుచని చెక్కిళ్లు. అరచేతి వెడల్పాన వెలుగులు చిమ్ముతున్న నేత్రద్వయం. శంఖంలాటి మెడలో పలుచని గొలుసు.

"ఆ ఫోటో మా అమ్మగారిది."

రవీంద్ర భుజంమీద టవల్‌తో వచ్చాడు. వెనకనే కనకాంబరం రంగు చీరలో ఒక యువతి, ఇందాకటి కుర్రాడు వచ్చారు.

"మా ఆవిడ..పబ్లిక్ స్కూల్లో టీచరు" అని పరిచయం చేశాడు.

ముందే చెప్పినట్లున్నాడు. ఆమె అత్యంత గౌరవ భావంతో నమస్కరించింది.

ఆ వెంటనే "టీ తెస్తాను". అంటూ వెనుతిరిగి వెళ్లింది. కుర్రాడు ఆమెను అనుసరించాడు.

రవీంద్ర ఆ ఫోటో చేతిలోకి తీసుకుని కూర్చున్నాడు.

"మా అమ్మ నా చిన్నప్పుడే పోయింది. అంటే బొత్తిగా చిన్నతనం కాదనుకోండి. నాకప్పుడు పదిహే నేళ్ళు ఉంటాయేమో! మా నాన్నగారికి వేరే ఇల్లుండేది. వేరే పెళ్ళాం పిల్లలూ ఉండేవారు. మేము ఒక పాత పెంకుటింట్లో ఉండేవాళ్లం. మా నాన్న పోయాక మాకా ఇల్లే మిగిలింది. మా అమ్మ ఒక కుట్టుమిషనుతో కాలం గడుపుతూ ఉండేది. ఆ పని లేనప్పుడు విస్తళ్ళు కుట్టి నాచేత ఇంటింటికీ పంపిస్తుండేది. ఒకనాడు నేను స్కూల్లో ఉండగా మా పొరుగింటి ఆయన నాకోసం వచ్చాడు. ఆయనవెంట వచ్చేశాను. అప్పటికే అమ్మ చచ్చిపోయింది. ఆ రెండో రోజున మా మేనమామనంటూ ఒకాయన వచ్చాడు." రవీంద్ర ఇక్కడ ఆగాడు. టీ వచ్చింది.


"తీసుకోండి" అని నాకొక కప్పు అందించి, మరొకటి తాను తీసుకున్నాడు.

"ఆ మేనమామ చిత్రమైనవాడు. ఇక్కడ అమ్మ దాచివుంచిన మూటలేమైనా ఉంటాయేమోనని వచ్చాడుతప్ప ప్రేమాభిమానాలతో రాలేదు. ఇక్కడేమీ లేదని తెలిశాక మెరుపువేగంతో మాయమై పోయాడు. మళ్ళీ అయిపులేడు. ఆ తర్వాత పొరుగాయన నన్ను అభిమానంతో చేరదీశాడు. చదివించాడు. పైకి తీసుకువచ్చాడు. తన ఒక్కగానొక్క కూతుర్ని యిచ్చి పెళ్లి చేసి ఆయనా వెళ్ళిపోయాడు. మా ఆవిడే ఆవిడ. అదీ సంగతి. అన్నట్లు ఇప్పుడే వస్తాను. రికార్డు ప్లేయర్ కోసం ప్రయత్నిస్తాను."

ఈ మాటలని బయటికి వెళ్ళిపోయాడు. ఇది విన్న తర్వాత నా మానస మహాసాగరంలో అగాధా లలో ఎక్కడో దాగిన విషయం బయటికి వచ్చింది.

ఈమె అసలు పేరు రుక్మిణి. కోస్తా జిల్లాల్లో ఎక్కడి నుంచో ఎవడో ఆమెను మాయమాటలు చెప్పి తీసుకువచ్చాడు. అప్పటికే ఇది మహానగరం. ట్రాములూ వగైరాలతో హడావిడిగా ఉండేది. సినిమా స్టూడియోలు సందడిగా ఉండడం మొదలయింది. స్వాతంత్ర్యం ఇహనో ఇప్పుడో రాబోతున్న తరుణం. ఆమెను తీసుకువచ్చినవాడు దుర్మార్గుడు. వాడి వంచనకు గురై ఆమె యాతనలనుభవించింది. అప్పుడు నా బ్రతుకు కూడా బాగులేదు. ఆశలు అడియాసలైనాయి. చదువు వృథా అయింది. నేర్చుకున్న సంగీతం తిండి పెడుతుందేమోనని ఇక్కడికి చేరాను. కాని ఇక్కడా శనిదేవత నన్ను కాలూన నీయలేదు. చిల్లర మల్లర పనులు చేస్తూ బ్రతుకు వెళ్ళదీస్తూ ఉండే వాణ్ణి. రుక్మిణి పాపం చాలా అమాయకురాలు.

కొన్నాళ్లకే వాడి అసలు రంగు బయట పడింది. అప్పటికే ఆమె సాలెగూటిలో ఈగలాగ చిక్కుకుని ఉంది. ఓపికతో మంచి రోజుల కోసం ఎదురుచూడడంతప్ప, తలవంచి బ్రతకడం తప్ప, చేసేదేమీలేదని గ్రహించింది. అలా కొన్ని యేళ్ళు-బహుశా రెండు మూడేళ్ళు-గడిచాయి. అప్పుడొకనాడు ఆమె అదృష్టం పండి వాడొక ప్రమాదంలో మరణించడంతో ఆమెకు చెర తప్పినట్లయింది. అప్పుడు నాకు దగ్గరయింది. నా స్థితి చూసి ఆమె నామీద సానుభూతి చూపించింది. ఆమె స్థితి చూసి నేను సానుభూతి చూపించాను. కలో గంజో ఇద్దరం కలిసే తాగే వాళ్ళం. అదీ కొద్ది కాలమే. ఆ తర్వాత ఒకనాడొక చిత్రం జరిగింది. ఒక రాత్రి అంతా నన్ను కూర్చోబెట్టి మాట్లాడింది. నా సలహా కోరింది. ఒక పెద్దమనిషి ఆమెకు ఆసరాగా ఉంటానన్నాడు. ఆమె పోషణ భారం వహిస్తానన్నాడు. ఏ లోటూ రాకుండా చూసుకుంటానన్నాడు. 'ఏం చెయ్యమంటారు?' అని అడిగింది. నేను హతాశుణ్ణయ్యాను 'నీకిష్టమేనా?' అని అడిగాను. 'మరి చేసేదేముంది?' అని రెట్టించింది. నేను అంతవరకూ నా మనసులో మాట బయట పెట్టకుండా సంకోచించి తప్పు చేశానని అర్థంచేసుకున్నాను. అందువల్ల పెద్దమనిషిలాగా, ఆమె హితం కోరిన వాడిలాగా నటిస్తూ 'అదే మంచిది' అని సలహా ఇచ్చాను. అక్కడితో ఆ కథ ముగిసిపోయింది. తరువాత నా బ్రతుకు నాదయింది. ఊళ్ళు మారాను. ఉద్యోగాలు మారాను. ఎదుగూ బొదుగూ లేని అతి సాదా సీదా జీవితం గడిపాను.



"మా నాన్నగారికి వేరే ఇల్లుండేది. వేరే పెళ్ళాం పిల్లలూ ఉండేవారు. మానాన్న పోయాక మాకా ఇల్లే మిగిలింది."

రవీంద్ర లోపలికి వచ్చాడు. "సారీ! ఇలా మిమ్మల్ని కూర్చోబెట్టి వెళ్లాను. ఏమీ అనుకోవద్దు. రికార్డుప్లేయరు కోసం ప్రయత్నించి వచ్చాను. లాభం లేకపోయింది. ఒక ఫ్రెండ్ ఇంట్లో ఉంది కాని బొత్తిగా పనికిరాకుండా పాడైపోయి ఉంది."

అతడు బల్లక్రింది సొరుగు తీశాడు. లోపల బొత్తులు బొత్తులుగా రికార్డులున్నాయి. పైనుంచి చిరిగి పోయిన కవరుతోనహా ఒకదాన్ని బయటికి తీశాడు.

"ఇదిగో..నిన్న మీకు చెప్పానుగా..ఇది మీదే."

నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది. ఎంతో ఆప్యాయంగా దాన్ని అందుకున్నాను. రికార్డు ఇవత లికి తీశాను. శుభ్రంగానే ఉంది. గ్రామఫోను, దాని బాకా, పక్కనే తిష్ఠవేసుకుని కూర్చున్న కుక్క అంతా పాతవాసన. అందమైన వాసన వచ్చింది. దానిమీద అక్షరాలు, నీలంరంగుమీద బంగారురంగు అక్షరాలు స్పష్టంగానే ఉన్నాయి. మిలమిల మెరుస్తూ పాట, ఆ క్రింద నాపేరు, రికార్డు నెంబరు వగైరాలున్నాయి.

నేను మిగిలిన రికార్డులు తీశాను. ఒక్కొక్కటి చూస్తూ కూర్చున్నాను. శ్రవణయంత్రం పనిచేస్తూనే ఉంది. రికార్డుప్లేయరు లేకపోయినా అద్భుత సంగీతం వినిపిస్తున్నది. ఏవేవో, ఎప్పటెప్పటివో అమృతగళ ధ్వనులు. ఒక్కొక్క రికార్డులో ఒక్కొక్క సంగీతఝురి. ఒక్కొక్క విలక్షణమైన కంఠస్వరం. రకరకాల యంత్ర వాద్యాల బీభత్సమైన హోరు లేదు. నరాలమీద ప్రభావం చూపించే దరువులు, అరుపులు, విరుపులు లేవు. రసరమ్య లోకాలకు చేర్చి పారవశ్యం కలిగించే ప్రశాంత నాదాలు. కళ్ళముందు పరిచయమైన ముఖాలు. చెవులలో వారి విలక్షణ స్వరాలు..నా కళ్ళలో నీటిపొర నిలిచింది.


"ఇవన్నీ మా అమ్మ దాచి ఉంచింది. ఇవంటే ఆమెకెంత ఇష్టమో చెప్పలేను. ముఖ్యంగా మీ పాట అంటే మహా ఇష్టం. మాటిమాటికీ విని కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ ఉండేది. చిన్నతనంలో తెలియక 'ఎందుకమ్మా! ఏడుస్తున్నావు' అని చాలాసార్లు అడిగాను. నాకూ ఈ రికార్డంటే ఇష్టం. అసలా రచనే గొప్పది. పదాలతో కళ్లముందు వెన్నెల విరియించినట్లు ఉంటుంది. దానికితోడు మీ కంఠ స్వరం..సైగల్.. పంకజ్ మల్లిక్..నాగయ్యలకు దీటుగా.. సరే..ఇది మీది. మీరు తీసుకోండి. మీకిచ్చేశాను"

ఆ తర్వాతకూడా నేను శ్రవణయంత్రాన్ని ఆఫ్ చేయలేదు. చాలాసేపు మాట్లాడుకున్నాము. అతడెన్నో కబుర్లు చెప్పాడు. తర్వాత అతడు బలవంతం చేయగా భోజనంకూడా చేశాను. ఆ తర్వాత చిన్న కునుకుకూడా తీశాను. ఇంతసేపూ శ్రవణయంత్రం పనిచేస్తూనే ఉంది. నాలుగు గంటల వేళ కాఫీ తాగాను. మనసెంతో తేలికపడినట్లనిపించింది. ఇన్నాళ్ళు ఘనీభవించిన నిశ్శబ్దం, గ్లాని తొలగిపోయినట్లనిపించింది. అప్పుడిక లేచాను.

''చాలా దూరం పోవాలి. ఇంట్లో కంగారుపడుతూ వుంటారుకూడా'' అన్నాను. ''థాంక్యూ ఫర్ ఎవ్విరిథింగ్'' అన్నాను. నాగొంతు ఆర్ద్రమై ఉండాలి.

అతడుకూడా లేచాడు. నవ్వుతూ ''భలేవారండీ! నేనిప్పుడేమి చేశాను? ఆ రికార్డుమీది. మీకిచ్చేశాను. బహుశా ఇంకెక్కడా దొరకదు అది'' అన్నాడు.

నేను ఆ రికార్డును భుజానవున్న సంచిలో భద్రంగా ఉంచుకున్నాను. రవీంద్ర భార్య వచ్చి నిలబడింది. 'వస్తానమ్మా' అని చెప్పి ఆవరణలో నడిచి ఇవతలికి వచ్చాను. బస్‌స్టాప్‌వైపు నడిచాను.



దా

దాపు అంతా నిశ్శబ్దం. అందరి ముఖాలలో మెప్పుదల. ఆనందం. రావుగారు ఏదో మాట్లాడుతున్నారు.

సిటీబస్సు జనంతో కిటకిటలాడుతూ కడుపుతో ఉన్న దయ్యపు తేలులాగా వచ్చి ఆగింది. దిగేవారు దిగేలోపుగా, ఎక్కేవారు ఎక్కేలోపుగా డ్రయివర్ బస్సును ముందుకు దూకించాడు. నేను ఎక్కలేక పోయాను. అలా రెండు బస్సులు వెళ్ళిపోయాయి. చివరకు రెండు బస్సులు మారి ఇంటికి చేరేసరికి బాగా పొద్దుపోయింది. ఇంతసేపూ భుజానవున్న సంచిలోని ఆ ప్లేటును అతిజాగ్రత్తగా చూసుకున్నాను. ఏమాత్రం ఒత్తిడి తగిలినా, ఇప్పటి రికార్డులలాగా కాదు, టప్‌మని విరిగి ముక్కలైపోతుంది.

ఇంట్లో ఎవరి పనుల్లో వారున్నారు. లలిత మాత్రం నాకోసమే ఎదురుచూస్తున్నది కాబోలు, నన్ను చూడగానే లేచి 'ఏం నాన్నా! ఎక్కడికి వెళ్లావు? గాబరా పడిపోతున్నానింతసేపూ' అంటూ ఎదురువచ్చింది. ''తెలిసినవాళ్లింటికి వెళ్లాను పొద్దున. బలవంతంచేసి ఉంచేశారు'' అంటూ సంచిలోనుంచి రికార్డు ఇవతలికితీసి ''దీన్ని జాగ్రత్తగా ఉంచు'' అని అందించాను.

''ఏమిటిది?'' అంటూ అందుకుని చూసింది.

ఆలస్యంగా వచ్చానన్న అలుక కొంచెం తగ్గింది.

''రా, అన్నం తిందువుగాని. అందరి తిండ్లూ అయిపోయాయి. నువ్వూ నేనూ మిగిలాం'' అన్నది.

నేను చొక్కావిప్పి పెరట్లోకి వెళ్లి కాళ్ళు కడుక్కుని వచ్చాను. లలిత భోజనం వడ్డిస్తూ ''పొద్దుటి వర్షానికి ఇంట్లో రెండుమూడుచోట్ల చినుకులువడ్డాయి. పైన పెంకుల పరిస్థితి అధ్వాన్నంగాఉంది. తొందరలో తిరగనేయించడం మంచిది...'' ఇలా సాగించింది. చాలా నెమ్మదిగా మాట్లాడుతున్నట్లున్నది. నేను వేరేలోకంలో ఉన్నాను. అది గమనించి పెద్దగా ''ఏ లోకంలో ఉన్నావు నాన్నా! నేను చేప్పేది వింటున్నావా?'' అని అడిగింది మళ్ళీ. నేను ఉలికిపడి ''ఏం లేదు, ఏం లేదు. ఏమిటీ చెబుతున్నట్లున్నావు?'' అని అడిగాను.

మళ్ళీ నసుగుడు మొదలుపెట్టింది. నేను ఉన్నట్లుండి ''అమ్మడూ! పక్క రావుగారింట్లో రికార్డ్ ప్లేయర్ ఉందికదూ?'' అని అడిగాను. ''ఉంది'' అన్నది లలిత. నేను సంశయిస్తూ ''ఒక్కసారి మన రికార్డు విందామని ఉంది'' అన్నాను. లలిత ''అట్లాగే. నేను వెళ్లి అడిగివస్తాను'' అన్నది.

నేను తిండి ముగించి ముందుగదిలోకి వచ్చాను. లలిత పనులన్నీ పూర్తిచేసుకువచ్చి ''ఇప్పుడే అడిగిరానా?'' అన్నది. ''ఊఁ! వీలయితే ఇప్పుడే. విందాము..'' లలిత వెళ్లింది. నేను కుర్చీలో కూర్చున్నాను. సన్నగా గుండెల్లో ఎక్కడో నొప్పి మొదలయింది. ఈమధ్య కొంతకాలం నుంచీ ఇదొక కొత్త పరిణామం. చేత్తో గుండె నిమురుకుంటూ కూర్చుండిపోయాను. 'లోపల గుండె అనబడే అవయవం కొట్టుకోవడంలో ఏమన్నా తేడా వస్తున్నదా' అని అనుమానం కలిగింది. భూమ్మీద పడ్డప్పటినుంచి, ఆమాటకొస్తే, తల్లి కడుపులో పడ్డప్పటి నుంచి డెబ్బై ఏళ్లకు పైగా నిరంతరం సెకండు కాలం అయినా విశ్రాంతి లేకుండా కొట్టుకుంటూనే ఉన్నది. బాధల్లో, కష్టాల్లో, సుఖాల్లో, విషాదంలో ఎప్పుడూ తేడా రాలేదు. ఇప్పుడే ఏమన్నా లయ తప్పుతున్నదా?

అంతలోనే 'ఆ! ఏమీలేదు. అంతా పిచ్చిభ్రమ' అనుకుంటూనే కుడిచేత్తో ఎడమ చేతి నాడి పట్టుకుని చూసుకున్నాను. గుండె ఎలా ఆడుతున్నదో అంచనా వేసే ప్రయత్నం చేశాను. కాని చేతకాలేదు.

అంతలో లలిత వచ్చింది. ''రావుగారు మేలుకునే వున్నారు నాన్నా! పిల్లలూ వాళ్లు చదువుకుంటున్నారు. నేను చెప్పగానే ఒప్పుకున్నారు. 'దానికేం భాగ్యం రమ్మన్నారు. మేమూ విన్నట్లవుతుంది' అన్నారు.''

నేను ఒక రకమైన ఉద్వేగంతో లేచాను. కాళ్లు వణికినట్లనిపించింది. రావుగారి ఇంట్లో అప్పటికే అందరూ - రావుగారి భార్య, కొడుకులు, కోడలు, కాలేజీలో చదువుకుంటున్న కూతుళ్లు - ఒకచోట చేరారు. ఆయన రికార్డు ప్లేయరు స్పీడు సర్ది మేము వెళ్లేసరికి నన్ను చూసి నవ్వుతూ ''నాకు తెలియదండీ బాబూ ఆ పాట పాడింది మీరని. చాలాసార్లు విన్నాను. అది నా ఫేవరిట్ సాంగ్'' అన్నాడు. ఎందుకో ఆయన చాలా నెమ్మదిగా లోగొంతుకతో మాట్లాడుతున్నాడనిపించింది. సర్దుకు కూర్చోడంలో ఇద్దరు అమ్మాయిలు గొడవ పడుతున్నారు. వాళ్లు కూడా నెమ్మదిగా అరుచుకుంటున్నట్లు అనిపించింది. ఉన్నట్లుండి ఒక అబ్బాయి ఏదో అని నవ్వాడు. అది విని ఆడపిల్లలు కూడా నవ్వారు. అతడేమన్నాడో నాకు వినబడలేదు. నవ్వులు మాత్రం అతి తక్కువ స్థాయిలో మంద్రంగా వినిపించాయి.

ఆయన అంతా సిద్ధం చేసి రికార్డు పెట్టారు. 'ఏదీ, ఎంతకీ ధ్వని రాదేం' అనుకున్నాను. రికార్డు తిరుగుతూనే ఉంది. వాళ్లందరూ వింటున్నట్లు తెలుస్తూనే ఉంది. రావుగారైతే వింటూ ఆనందిస్తున్నట్లు కూడా తెలుస్తున్నది. లలిత వంక చూశాను. అది గొప్ప ఆనంద పారవశ్యంతో వింటున్నది.

నేను చెవి పక్క మెషీను స్విచ్ ఆన్‌చేసి ఉందో లేదో అని చూసుకున్నాను. ఆన్ చేసేవుంది. ముందేదో సన్నని ధ్వని చాలా దూరం నుంచివలె వినిపించింది తప్ప ఇప్పుడేమీ వినిపించడంలేదు. అంతా దాదాపు నిశ్శబ్దం.

అందరి ముఖాలలో మెప్పుదల, ఆనందం. రావుగారు ఏదో మాట్లాడుతున్నారు. పెదవుల కదలికను బట్టి చాలా మెచ్చుకున్నట్లు తెలిసింది.

ఉబికి వస్తున్న కన్నీళ్లను అతిప్రయత్నంమీద రెప్ప లప్పళించి ఆపుకుంటూ కూర్చుండిపోయానింతసేపూ. అంతా అయిపోయిన తర్వాత లలిత ఆ రికార్డు అందుకుని 'పద నాన్నా! పోదాం' అని కాబోలు అన్నది.

ఆ తర్వాత ఇద్దరం ఇంటికి వచ్చాము. నేను వచ్చీరాగానే మంచంలో కూలబడ్డాను. ఇంట్లో మిగిలిన వారు ఎవరిపాటికి వారు నిద్రకు పడ్డారప్పుడే.

లలిత రికార్డును భద్రంగా జాగ్రత్త చేసి వచ్చి ఏదో మాట్లాడుతూనే చాప పరుచుకుంది. మరేదో మాట్లాడుతూనే నడుం వాల్చింది.

నేను పడుకున్నాను. ఉన్నట్లుండి నిట్టూర్పు వచ్చింది. ఆ తర్వాత కళ్ళ నీళ్ళు ఉబికి ఉబికి వచ్చాయి. అంతలో లేచి ''అమ్మడూ! బ్యాటరీ అయిపోయిందే బొత్తిగా'' అన్నాను.

''పడుకో నాన్నా! రేపు చూద్దాంలే. అన్నట్లు ఆ బ్యాటరీలు దొరకడం లేదు. అయినా ప్రయత్నం చేద్దాం. రెండు మూడు రోజుల్లో ఎక్కడో ఒకచోట దొరకవచ్చులే. ఇప్పుడు పడుకో'' అంది.

నేను వెల్లకిలా పడుకున్నాను.

కుడి చెయ్యి అప్రయత్నంగా గుండెల మీదికి వెళ్ళింది. ఇప్పటికిది ఆడుతూనే ఉంది.

రెండుమూడు రోజులు. బహుశా ఒకవారం రోజులు... అప్పటికి ఈ గుండె ఇలాగే ఆడుతూ ఉంటుందా? అంతలో మనసు లోలోపలి పొరలలో నుంచి ఒక ప్రశ్న ఉదయించింది.

'అసలిప్పుడు నిద్రపోతే తెల్లవారాక లేస్తానా?'

కాస్సేపటికి మగత నిద్రలో దూరంనుంచి మొదట మందంగానూ, ఆ తర్వాత ఉధృతంగానూ ఏవో వింత పదధ్వనులు వినిపించాయి. ●